విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell: 9247819181
8309605189



# మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం


MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET

MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 197 | volume: 1, Issue:197 | శనివారం 14 ఫిబ్రవరి 2026 పేజీలు : 8 వెల : 3.00


## సేవా తీర్థం నుంచి నూతన పరిపాలనకు శ్రీకారం



**న్యూఢిల్లీ:** భారత పరిపాలనా వ్యవస్థలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నూతన పరిపాలనా కేంద్రం "సేవా తీర్థం" నుంచి కీలక నిర్ణయాలు ప్రకటించారు. దశాబ్దాల నాటి పాత మౌలిక సదుపాయాలకు స్వస్తి పలుకుతూ కర్తవ్య భవన్-1, కర్తవ్య భవన్-2 సముదాయాలను జాతికి అంకితం చేశారు. ఇది కేవలం భవనాల సముదాయం కాదని, నవ భారత పనితీరు, పారదర్శక పాలనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు సెంట్రల్ విస్టాలో చెల్లాచెదురుగా ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్ వంటి కీలక విభాగాలను ఒకే ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లోకి తరలించారు. దీనివల్ల శాఖల మధ్య సమన్వయం పెరిగి నిర్ణయాల ప్రక్రియ వేగవంతం అవుతుందని ప్రభుత్వం వెల్లడించింది. మొత్తం 11 కీలక మంత్రిత్వ శాఖలు ఈ సముదాయాల్లో కొలువుదీరనున్నాయి. నూతన కార్యాలయంలో అడుగుపెట్టిన తొలి రోజే ప్రధాని మోదీ ప్రజాహిత ఫైళ్లపై సంతకాలు చేశారు. ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందించే PM •పథకాన్ని ప్రారంభించారు. మహిళా సాధికారతకు ఊతమిస్తూ 2029 నాటికి 6 కోట్ల మంది మహిళలను లఖ్పతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని రూ. 2 లక్షల కోట్లకు పెంచుతూ రైతులకు అండగా నిలిచారు. అలాగే రూ. 10,000 కోట్ల కార్పస్‌తో స్టార్టప్ ఇండియా 2.0 ఫండ్‌కు ఆమోదం తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ సముదాయాలను 4-స్టార్ GRIHA గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించారు. సుమారు రూ. 1,189 కోట్ల వ్యయంతో 2.26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో సోలార్ ప్యానెల్స్, నీటి రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ, డిజిటల్ ఇంటిగ్రేషన్ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రజల సౌకర్యార్థం కేంద్రీకృత రిసెప్షన్, పబ్లిక్ ఇంటర్‌ఫేస్ జోన్‌లు ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలనను మరింత సులభతరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది.

## కర్మయోగంతో శక్తివంతమైన భారత్ నిర్మాణం: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము




**న్యూఢిల్లీ:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము న్యూఢిల్లీలో నిర్వహించిన అఖిల భారత సదస్సును ప్రారంభించారు. అదే సందర్భంగా బ్రహ్మ కుమారీస్ సంస్థ చేపట్టిన 'శక్తివంతమైన భారత్ కోసం కర్మయోగం' అనే దేశవ్యాప్త ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గురుగ్రామ్‌లోని ఓం శాంతి రిట్రీట్ సెంటర్ రజతోత్సవాలను కూడా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ఆధ్యాత్మికత మనకు మౌలిక విలువలను, నైతిక దిశానిర్దేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. సమాజానికి నిస్వార్థ సేవ చేయడం అంటేనే కర్మయోగమని, అదే వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన కర్తవ్యాన్ని సమర్థంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక సంస్థలు సమాజంలో నైతిక విలువలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. కర్మయోగం భావన ద్వారా సేవాస్ఫూర్తిని పెంపొందించి శక్తివంతమైన భారత నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సంస్థ ప్రతినిధులు, ఆధ్యాత్మిక గురువులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఈ ప్రచార కార్యక్రమం ద్వారా యువతలో సేవాభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉమ్మడి ఖమ్మంలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్




- 7 మున్సిపాలిటీలపై హస్తం పాగా...
- మధిరలో 18 వార్డులతో స్పష్టమైన ఆధిక్యం...
- కొత్తగూడెం కార్పొరేషన్‌లో హంగ్.. సీపీఐకి బీఆర్ఎస్ మద్దతు...

**ఖమ్మం, ఫిబ్రవరి 13:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. జిల్లాలోని అశ్వారావుపేట, ఇల్లెందు, కల్లూరు, మధిర, సత్తుపల్లి, వైరా, ఎదులాపురం మున్సిపాలిటీలను హస్తం పార్టీ కైవసం చేసుకుంది. అన్ని మున్సిపాలిటీల్లో స్పష్టమైన ఆధిక్యంతో కాంగ్రెస్ సత్తాచాటింది. అశ్వారావుపేటలో 22 వార్డులకు గానూ కాంగ్రెస్ 17 వార్డులు గెలుచుకోగా, భారత రాష్ట్ర సమితి 2, భారతీయ జనతా పార్టీ 1, ఇతరులు 2 స్థానాల్లో విజయం సాధించారు. ఇల్లెందులో 24 వార్డుల్లో కాంగ్రెస్ 19 గెలుచుకుని ఆధిపత్యం చాటింది. కల్లూరులో 20 వార్డుల్లో 12 స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోగా, బీఆర్ఎస్ 6, బీజేపీ 1, ఇతరులు 1 స్థానాల్లో గెలిచారు. ఉప ముఖ్యమంత్రి మల్లూ భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిరలో కాంగ్రెస్ ఘన విజయాన్ని నమోదు చేసింది. 22 వార్డుల్లో 18 స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. బీఆర్ఎస్ ఒకటి, ఇతరులు మూడు వార్డులు గెలిచారు. వైరా, మధిర, ఎదులాపురం, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో మొత్తం 117 వార్డులకు గానూ 83 వార్డుల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో 46 వార్డులకు 36 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. ఇక కొత్తగూడెం కార్పొరేషన్‌లో ఆసక్తికర పరిస్థితి నెలకొంది. 60 డివిజన్లకు జరిగిన ఎన్నికల్లో సీపీఐ 24, కాంగ్రెస్ 20, బీఆర్ఎస్ 9, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 5 చోట్ల విజయం సాధించారు. మేయర్ పీఠం కోసం 31 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరముండగా, సీపీఐకి మద్దతు ఇస్తామని కేటీఆర్ ప్రకటించారు. దీంతో మేయర్ పదవి సీపీఐ ఖాతాలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబరాలు నిర్వహించి విజయోత్సవ ర్యాలీలు చేపట్టారు. జిల్లాలో కాంగ్రెస్ పట్టు మరింత బలపడినట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి.

## ఐదుగురిపైకి దూసుకెళ్లిన కారు..



**లక్నో:** ఫేర్‌వెల్ పార్టీ నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్న 12వ తరగతి విద్యార్థి కారుపై నియంత్రణ కోల్పోయి ఐదుగురిపైకి దూసుకెళ్లిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో విషాదానికి దారితీసింది. ఈ ప్రమాదంలో ఆరేళ్ల బాలుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ప్రమాదం అనంతరం కారు వదిలేసి పరారైన విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, 21 ఏళ్ల గౌరవ్ సింగ్ గురువారం సాయంత్రం ఫేర్‌వెల్ కార్యక్రమం అనంతరం కారులో ఇంటికి బయలుదేరాడు. వేగంగా వెళ్తున్న కారు ముందుగా రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టింది. ఆ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి కిందపడగా, వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన నిల్చొని ఉన్న ఒక కుటుంబంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అర్మాన్, సాధనా పటేల్, ఆమె తల్లి మీనా దేవి గాయపడ్డారు. సాధనా ఆరేళ్ల కుమారుడు దీక్షాంత్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ-ఆటో డ్రైవర్ అవధ్ బిహారీ కూడా గాయాలతో చికిత్స పొందుతున్నాడు. కారు పల్టీలు కొట్టిన తర్వాత విద్యార్థి గౌరవ్ సింగ్ తన స్నేహితుడితో కలిసి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీటీవీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారును జప్తు చేసి, విద్యార్థిని అరెస్ట్ చేశారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి.

## కరీంనగర్‌లో కమల వికాసం

### బీజేపీ ఖాతాలో మేయర్ పీఠం




**కరీంనగర్, ఫిబ్రవరి 13** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ హవా కొనసాగుతున్నప్పటికీ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం కమలం వికసించింది. మొత్తం 66 డివిజన్లలో జరిగిన పోటీలో భారతీయ జనతా పార్టీ 33 స్థానాలు గెలుచుకుని సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 12, భారత రాష్ట్ర సమితి 9, ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ 7, ఇతరులు 5 స్థానాలకు పరిమితమయ్యారు. మేయర్ పీఠానికి అవసరమైన మేజిక్ ఫిగర్ 34 కాగా, బీజేపీ 33 స్థానాలతో మెజారిటీకి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్స్‌ఆఫీషియో ఓటు బీజేపీకి కీలకంగా మారింది. ఆ ఓటుతో బీజేపీ బలం 34కు చేరడంతో ఎటువంటి ఇతర పార్టీల మద్దతు అవసరం లేకుండానే మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మూడో స్థానానికి పడిపోవడం గమనార్హం. కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకున్నప్పటికీ బీజేపీ జోరును అడ్డుకోవడంలో విఫలమైంది. ఈ ఫలితాలతో కరీంనగర్ మరోసారి బీజేపీకి బలమైన కంచుకోటగా నిలిచిందని పార్టీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ నిర్వహించిన కార్యక్రమాలు, అభివృద్ధి నినాదాలు ఓటర్లను ఆకట్టుకున్నాయని పార్టీ నాయకులు చెబుతున్నారు. పాత నగర ప్రాంతాల్లోనూ బీజేపీ గట్టి పోటీ ఇచ్చి స్థానాలు గెలుచుకోవడం విశేషంగా మారింది. ఈ విజయంతో ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ బలాన్ని మరోసారి చాటుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ మున్సిపల్ ఫలితాలు కాంగ్రెస్ ఆధిక్యం



**హైదరాబాద్:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతుండగా, ఇప్పటివరకు అత్యధిక మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫలితాల ధోరణి కాంగ్రెస్‌కు అనుకూలంగా కొనసాగుతోంది. పలు జిల్లాల్లో స్పష్టమైన ఆధిక్యం నమోదు అవుతోంది. సంగారెడ్డి జిల్లాలోని రామాయంపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఇక్కడ ఓ వార్డు నుంచి బెజవాడ నాగరాజు 126 ఓట్ల మెజార్టీతో సమీప అభ్యర్థిపై గెలుపొందగా, మరో వార్డు నుంచి ఆయన భార్య లావణ్య 281 ఓట్ల మెజార్టీతో విజయం సాధించడం విశేషం. భార్యాభర్తలు ఒకేసారి రెండు వార్డుల్లో గెలవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు అందిన సమాచారం ప్రకారం కాంగ్రెస్ పార్టీ 48 మున్సిపాలిటీలను కైవసం చేసుకోగా, భారత రాష్ట్ర సమితి 10, ఇతరులు 14 మున్సిపాలిటీల్లో విజయం సాధించారు. పలు ప్రాంతాల్లో లెక్కింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. వార్డుల పరంగా చూస్తే కాంగ్రెస్ పార్టీ 1,187 వార్డుల్లో ఆధిక్యం సాధించగా, భారత రాష్ట్ర సమితి 638, భారతీయ జనతా పార్టీ 214, ఇతరులు 212 వార్డుల్లో విజయం సాధించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ ఫలితాలు కీలక మార్పులకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి.

## వడ్డేపల్లిలో ఫార్వర్డ్ బ్లాక్ జెండా



**హైదరాబాద్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కలిసి పోటీ చేసిన నేపథ్యంలో అనూహ్య ఫలితాలు వెలువడుతున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీని ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తం 10 వార్డులకు గాను 8 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయకేతనం ఎగరవేశారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి ఒక్కో స్థానానికే పరిమితమయ్యాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతుదారులు ఈ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలోకి దిగారు. రాష్ట్రవ్యాప్తంగా 40 మున్సిపాలిటీల్లోని 212 వార్డుల్లో పోటీ చేశారు. వడ్డేపల్లిలో 8 వార్డులు గెలుచుకోగా, సుల్తానాబాద్‌లో ఒక వార్డు, పెద్దపల్లిలో ఒకటి, మంథనిలో ఒకటి గెలిచారు. రామగుండంలో 10 వార్డుల్లో లీడ్ కొనసాగుతుండగా, ఆదిలాబాద్‌లో 8 మంది అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. మంచిర్యాలలో 4 స్థానాల్లో ఫార్వర్డ్ బ్లాక్ ముందంజలో ఉంది. ఓవరాల్‌గా సుమారు 40 వార్డులు గెలుస్తామని ఫార్వర్డ్ బ్లాక్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెక్ పెడుతూ చిన్న పార్టీల ప్రభావం పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రాచుర్యం ఫలితాల్లో కీలక పాత్ర పోషించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ విజయం వెనుక కవిత వ్యూహం పనిచేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అక్కడ బలమైన నేతగా పేరున్న వడ్డేపల్లి శ్రీనన్న కొంతకాలం క్రితం తెలంగాణ జాగృతిలో చేరడం పార్టీకి బలం చేకూర్చినట్లు తెలుస్తోంది. ఆయన చేరికతో స్థానిక స్థాయిలో మద్దతు పెరిగి ఈ ఫలితాలు సాధ్యమైనట్లు సమాచారం.

## కేవైసీ ప్రతి పౌరునికి ఆర్థికంగా భద్రత చేకూర్చే హక్కు



**–లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్....**

**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 13 :** కేవైసీ ప్రతి పౌరునికి ఆర్థికంగా బద్ధత చేకూర్చే ఒక హక్కు అని లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్ అన్నారు, ఎల్లారెడ్డిపేట కొత్త బస్టాండ్ నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్ మాట్లాడుతూ రిజర్వుడు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలకు అనుగుణంగా ఆర్థిక అవగాహన వారవోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 9 నుండి 13 వరకు కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు, ఓటిపి ఇతరులకు షేర్ చేయకూడదని తెలియని లింకుల మీద క్లిక్ చేయవద్దని అయన అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బ్యాంకు మోసాల గురించి ఆయన వివరించారు బ్యాంకు ఖాతాల వివరాలను ఇతరులకు చెప్పకూడదని జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు, ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని బ్యాంకు మేనేజర్లు దామోదర్ శ్రవణ్ , బ్యాంకు సిబ్బంది ఏపీఎం సరస్వతి సి ఎల్ సి ఏ లు కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## గ్రామ సభను విజయవంతం చేసిన సర్పంచ్ కొండా రమేష్ గౌడ్



**మన వార్తా ప్రతినిధి ఎల్లారెడ్డిపేట మండలం ఫిబ్రవరి: 13**రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని ఈరోజు గ్రామసభను నిర్వహించిన గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్, ఇట్టి సభలో గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న డ్రైనేజీ గాని సిసి రోడ్స్ గాని వీధిలైట్స్ గాని వీటిపై ఈరోజు గ్రామసభలో చర్చించుకోవడం జరిగినది, ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ పొన్నాల మనమ్మ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ, మరియు వార్డు సభ్యులు గాంతుల సత్తయ్య యాదవ్, గొర్రె మల్లేశం యాదవ్, కొండ పర్శాయ గౌడ్,హరీష్, సతీష్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడి టీచర్స్, మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు

# మధిరలో వార్ వన్ సైడ్



**మధిర, ఫిబ్రవరి 13( మన వార్త):**పట్టు వదలని విక్రమార్కుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అని మరోమారు రుజువైంది.మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని పట్టుబట్టి ఒకవైపు పార్టీ శ్రేణులను కదిలించారు,పోరాట స్ఫూర్తిని నింపారు.మరోవైపు రాబోయే 50 సంవత్సరాలకు సరిపడా మధిర అభివృద్ధికి చేస్తున్న కృషిని ఓటర్లకు తానే స్వయంగా వివరించి వారి మనసు గెలిచి ఘన విజయం సాధించారు.అన్ని తానై ముందుకు నడిచిన భట్టి విక్రమార్క తిరుగులేని ప్రజా నాయకుడని, తాను ఓ క్యాడర్ లీడర్ అని మరోసారి నిరూపించుకున్నారు. భట్టి విక్రమార్క ఏ పని చేసినా పద్ధతి ప్రకారం చేసి ఫలితం సాధిస్తారని మరోసారి స్పష్టమైంది.గత పది సంవత్సరాలు మన పార్టీ అధికారంలో లేదు.మున్సిపాలిటీ కూడా మన చేతిలో లేదు. ఆ పార్టీ అభివృద్ధి నిధులు కూడా మంజూరు చేయలేదు.ఈ సమయంలో మధిర ఎమ్మెల్యేగా మున్సిపాలిటీ బోర్డుపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించడం సాధ్యం కానీ పని అని విజ్ఞులైన, ప్రజాస్వామ్యవాది భట్టి విక్రమార్క మౌనంగా భరించారు.తిరిగి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిప్యూటీ సీఎంగా ఆర్థిక, విద్యుత్తు మరియు ప్రణాళికా శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు చేతికి వచ్చాయి. మరోవైపు స్వయంగా తానే ప్రచార రంగంలోకి దిగారు. ఎన్నికల ముందు నిర్వహించిన భారీ ర్యాలీతోనే మధిర మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని తేలింది.తాను డిప్యూటీ సీఎం అయినా చిన్న మున్సిపాలిటీలో ప్రచారం చేయడం అవసరమా అనే భావన లేకుండా వార్డుల వారీగా ప్రచారంలోకి దిగారు. రాబోయే 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా మధిర పట్టణాన్ని ఎలా అభివృద్ధి చేయబోతున్నారో కళ్లకు కట్టినట్టు వివరించి ఓటర్లను మెప్పించారు.స్వచ్ఛమైన, సుందరమైన మధిర కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్తు, వరద నీటి ఇబ్బంది లేకుండా వైరా నదికి అడ్డంగా కరకట్ట, మధిర పట్టణ విస్తరణకు హైదరాబాద్ తరహాలో ఔటర్ రింగ్ రోడ్డు వంటి పనులకు అనుమతులు సాధించి వేగంగా పనులు చేపడుతున్న తీరును వివరించారు.గత కొన్ని నెలలుగా మధిర మున్సిపాలిటీపై విపక్షాలు చిమ్ముతున్న విషాన్ని తన రెండు రోజుల ప్రచారంతో డిప్యూటీ సీఎం తిప్పికొట్టారు. మధిర పట్టణ ప్రజల మనసులు గెలిచారు.విక్రమార్కుని వ్యూహం ఫలించింది. రికార్డులు తారుమారు అయ్యాయి. మధిర మున్సిపాలిటీని 22 స్థానాలకుగాను 21వార్డుల్లో కాంగ్రెస్ కూటమి ఏకపక్షంగా గెలుచుకొని విజయ దుందుభి మోగించింది.బి ఆర్ ఎస్, సిపిఎం,సిపిఐ కూటమి ఒకే ఒక్క వార్డుకు పరిమితం కావడం భట్టి రాజకీయ చాణక్యానికి అద్దం పట్టింది. మధిర మొత్తం “జయహో భట్టి విక్రమార్క” అంటూ నినదించింది.

## తాళ్ళలపల్లెను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం..



**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 13 (మన వార్త ప్రతినిధి);**తాళ్ళలపల్లె గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సర్పంచ్ మీసాల కనకరాజు తెలిపారు.శుక్రవారం ఇల్లంతకుంట మండల పరిధిలోని తాళ్ళలపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మీసాల కనకరాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తామని చెప్పారు.గ్రామంలో సీసీ రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,తాగునీటి సదుపాయం,విద్యుత్ సరఫరా,వీధి దీపాలు,ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.రెండు సంవత్సరాలకు సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులతో కూడిన గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక (జీపిడిపి)ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.గత సమావేశ తీర్మానాలను గ్రామ కార్యదర్శి గుర్రం ప్రవీణ్ కుమార్ సభలో చదివి వినిపించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొర్ల కమలాకర్,వార్డు సభ్యులు కొలుపుల సందీప్,గొర్ల శ్రీకాంత్,నూనె కేత శ్రీనివాస్ యాదవ్,అంగన్‌వాడీ టీచర్ ఇరుమల్ల స్వప్నతో పాటు గ్రామస్తులు నూనె శ్రీనివాస్ యాదవ్,గుర్రాల రాజయ్య,మూడపెల్లి చందు,ఇరుమల్ల నర్సయ్య,కమల్ల ఎల్లేష్,లక్ష్మి రాజం,కనకయ్య,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద డ్రైనేజీ పూడిక తీయించిన సర్పంచ్ పాలకవర్గం



**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డి పేట పిబ్రవరి 13 :** హరిదాస్ నగర్ గ్రామంలో సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్, మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో గల పెద్ద మోరి డ్రైనేజీలో గల పూడిక తీత పనులను చేయించడం జరిగింది,ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, ఉప సర్పంచ్ గుమ్మడి సతీష్, వార్డ్ నెంబర్లు బొల్లు రాజు, ఉప్పుల ఎల్లారెడ్డి, తెడ్డు అనిత, మరియు మహేష్, విశాల్, ఇట్టి కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు


# ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ దే హవా



**–కాంగ్రెస్ మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు....**

**మధిర, ఫిబ్రవరి 13( మన వార్త):**ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ దే హవా అని, ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా,ఎత్తుగడలు వేసినా. నోర్లు పారేసుకున్నా కాంగ్రెస్ గెలుపును నిలువరించడం ఎవరి తరం కాదని,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధికే ప్రజల పట్టం కట్టారని కాంగ్రెస్ పార్టీ మధిర మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు అన్నారు.శుక్రవారం మధిర మున్సిపాలిటీకి వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్,టిడిపి కుటమి అభ్యర్థులు 21 స్థానాల్లో విజయం సాధించారు.4వ వార్డు ఇల్లందులపాడు విజేత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామినేని సుజాత 394 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందడంతో కాంగ్రెస్, టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా,సామినేని సుజాత రామనాథం మాట్లాడుతూ,ఇంతటి ఘన విజయం అందించిన 4వార్డు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అంగన్వాడి టీచర్ పై మానవ హక్కుల కమిషన్ విచారణ




**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 13 :** రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ( ఎస్ హెచ్ ఆర్ సి )కేసు విచారణను స్వీకరించింది రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ లో అంగన్వాడీ టీచర్ సలువాజీ రాణి అల్లరి చేశాడనే కారణంతో మూడున్నర ఏళ్ల బాలుడు విద్వాన్ను దారుణంగా కొట్టడంతో కుడికన్నుకు చేతులకు కాళ్లకు గాయాలయ్యాయి, ఆరోపణల పై బాలుడు ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ( ఎస్ హెచ్ ఆర్ సి ) కమిషన్ కేసును స్వయంగా స్వీకరించి విచారణ ప్రారంభించింది టీచర్ కొట్టినట్లు రుజువైతే రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విరుద్ధమని జువైనల్ జస్టిస్ కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ చట్టం 2015 ఇతర బాలల రక్షణ చట్టాల ఉల్లంగనగా కమిషన్ పేర్కొంది బాధిత బాలుడి ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి వైద్య నివేదిక ఆరోపణలు ఎదుర్కొంటున్న అంగన్వాడీ టీచర్ పై తీసుకున్న క్రిమినల్ శాఖ పరమైన చర్యలు పోలీస్ దర్యాప్తు ఎఫ్ఐఆర్ స్థితి అన్ని అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల భద్రత కోసం తీసుకున్న చర్యలపై మార్చి 9 లోపు పూర్తి నివేదిక సమర్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ను కమిషనర్ ఆదేశించింది, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ సరిత గోగుల ఇంస్టాగ్రామ్ లో స్పందిస్తూ మూడున్నర సంవత్సరాల బాలుడు పై చితకబాదిన సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అంగన్వాడి టీచర్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు,

## 32 వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గెలుపు



**మన వార్త ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 13** :సిరిసిల్ల మునిసిపాలిటీలోని 32వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కూరపాటి శ్రీశైలం గెలుపొందారు,ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు హరిదాస్ నగర్ గ్రామ సర్పంచ్ సిర్రం నాగరాజు యాదవ్ లు అభ్యర్థి కూరపాటి శ్రీశైలం గెలుపు కొరకు అవార్డులో ఎన్నికల ప్రచార ఇన్చార్జిలుగా బాధ్యతలు నిర్వర్తించారు, వారితో పాటు హరిదాస్ నగర్ సర్పంచ్ చెర్రం నాగరాజు యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ మల్లారెడ్డి , నాయకులు మద్దుల శ్రీపాల్ రెడ్డి, సాదు సాయి రెడ్డి, ఆయన గెలుపు కొరకు అ వార్డులో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు, రేవంత్ రెడ్డి,సర్కార్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లను వారు అభ్యర్థించారు, ఈ సందర్భంగా కౌన్సిలర్ గా గెలుపొందిన కూరపాటి శ్రీశైలం, మాట్లాడుతూ తనను గెలిపించిన వార్డు ప్రజలకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తన గెలుపు కోసం కృషిచేసిన కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, కి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, కు పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, కు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికీ పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు, 32 వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన సందర్భంగా శ్రీశైలం,కు వారు స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు గెలుపొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఒకరినొకరు స్వీట్లు పంచుకున్నారు

## ప్రశాంతంగా ముగిసిన ఓట్ల లెక్కింపు– భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు



**రామాయంపేట ఫిబ్రవరి 13 ( మన వార్త ప్రతినిధి)** మెదక్ జిల్లా రామాయంపేట మండలం రామాయపేట మున్సిపాలిటీలో ఈనెల 11వ తేదీన జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును నేడు ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 8 గంటలకు ప్రారంభించారు, ఓట్ల లెక్కింపు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటరాజా గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు, మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 12 వార్డులగాను 8 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా మూడు వార్డులలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా బిజెపి అభ్యర్థి ఒక్క వార్డులో గెలుపొందడం జరిగింది, 12 వార్డుల ఓట్లను మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేశారు కాంగ్రెస్ నుంచి చైర్మన్ అభ్యర్థి గజవాడ లావణ్యనాగరాజు తమ సమీప అభ్యర్థి పాతూరి అనుపమపై 281 ఓట్ల అధిక్యతతో గెలుపొందినట్లు అధికారులు తెలిపారు , రెండవ వార్డ్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్ 26 ఓట్ల ఆదిక్యత తో గెలుపొందగా మూడో వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి రవి 19 ఓట్ల తేడాతో విజయం సాధించారు, నాలుగో వార్డ్ నుండి బైరం స్వప్న కుమార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు, ఐదవ వార్డు నుండి టిఆర్ఎస్ అభ్యర్థి చౌదరి చరిత 105 ఓట్ల ఆదిక్యతతో గెలుపొందగా, ఆరవ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి పుట్టి సందీప్ 13ఓట్ల తేడాతో విజయం సాధించారు, ఏడవ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి గజవాడ నాగరాజు 186 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, 8వ వార్డు నుండి బిజెపి అభ్యర్థి జంగంపల్లి శంకర్ గౌడ్ 202 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు, 9వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి దేవుని రంజిత్ గెలుపొందారు, 10వ వార్డు నుండి బి ఆర్ ఎస్ అభ్యర్థి మద్దెల మాధవి రమేష్ 39 ఓట్ల తేడాతో గెలుపొందారు, 11వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి డాకి శ్యామలస్వామి విజయం సాధించారు, 12వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి పోచమ్మల నవనీత గణేష్ గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులకు అధికారులు ఎన్నిక ధ్రువపత్రాలను అందజేశారు.

## ఘనంగా కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు...



**రామయంపేట ఫిబ్రవరి 13 (మన వార్త ప్రతినిధి)** రామాయంపేట మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది రామాయంపేట మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేశారు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి లావణ్య నాగరాజు తోపాటు, రవి నాయక్, బైరం స్వప్న, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, పోచమ్మల నవనీత, కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా బిజెపి అభ్యర్థి శంకర్ గౌడ్ 8వ వార్డు నుండి గెలుపొందారు, బీఆర్ఎస్ పార్టీ మూడు స్థానాలకే పరిమితమైంది కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి భారీ ర్యాలీ నిర్వహించి టపాకాయలు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు, ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ స్వీట్లు పంచుకున్నారు, ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతోనే రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతాదన్న నమ్మకంతోనే ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతామని వారు అన్నారు, రామాయంపేట గడ్డ మైనంపల్లి కుటుంబానికి అడ్డాగా మారిందని బీఆర్ఎస్ కల్లబొల్లి మాటలు రామయంపేట ప్రజలు ఇక నమ్మలేరని వారన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సరాఫ్ యాదగిరి, అమర సేనా రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జీలు రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి, రామాయంపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, సిద్ధిరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, దేమే యాదగిరి, ఫ్లోవెల్ కృష్ణారెడ్డి, విప్లవ కుమార్, చింతల యాదగిరి,మహేందర్ సింగ్, శ్రీధర్ రెడ్డి, బిక్షపతి చిరంజీవి రాజాసింగ్, అశోక్ నాయక్, తదితరులు పాల్గొన్నారు

# నల్గొండలో కాంగ్రెస్ చారిత్రాత్మక విజయం: కోమటిరెడ్డి

-48 వార్డుల్లో 27 కాంగ్రెస్ ఖాతాలో....
-హైదరాబాద్‌కు దీటుగా నల్గొండ అభివృద్ధి హామీ....
-వారానికి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని ప్రకటన....


**నల్గొండ, ఫిబ్రవరి 13 :** నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీ కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని పేర్కొన్నారు. మొత్తం 48 వార్డుల్లో కాంగ్రెస్ 27 స్థానాలు గెలుచుకోగా, భారత రాష్ట్ర సమితి 9, భారతీయ జనతా పార్టీ 4, ఇతరులు 8 స్థానాలు దక్కించుకున్నారు. ఈ ఫలితాలతో నల్గొండలో కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ" అని ప్రజలు మరోసారి నిరూపించారని మంత్రి వ్యాఖ్యానించారు.గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచిస్తూ, ఓటమి చెందిన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని అన్నారు. తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకపై వారానికి రెండు రోజులు నల్గొండలోనే అందుబాటులో ఉంటానని మంత్రి ప్రకటించారు. ప్రతి డివిజన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించి క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.




# మధిరలో టీడీపీ హ్యాట్రిక్ విజయం

- 17వ వార్డులో ములకలపల్లి వినయ్ కుమార్ గెలుపు...
- 128 ఓట్ల మెజారిటీతో స్పష్టమైన ఆధిక్యం...
- పోటీ చేసిన మూడు స్థానాల్లోనే విజయం...

మధిర, ఫిబ్రవరి 13 తెలంగాణలో మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి పొత్తులో పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ ముచ్చటగా మూడు వార్డుల్లో విజయం సాధించింది. 17వ వార్డు నుంచి ములకలపల్లి వినయ్ కుమార్ 128 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.కౌంటింగ్ ప్రారంభం నుంచే వినయ్ కుమార్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచారు. చివరి ఫలితాల్లో ఆయన ప్రత్యర్థిపై గణనీయమైన మెజారిటీ సాధించారు. ఈ గెలుపుతో మధిరలో టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేసిన మూడు స్థానాల్లోనే విజయం సాధించడం విశేషంగా మారింది. వంద శాతం స్ట్రైక్ రేట్‌తో మూడు స్థానాలను కైవసం చేసుకోవడం పార్టీకి ఉత్సాహాన్ని నింపింది. స్థానికంగా టీడీపీ బలాన్ని మరోసారి చాటుకున్నామని నాయకులు పేర్కొంటున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా ఇదే జోష్ కొనసాగుతుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



# సరోజిని నాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి




**శంకరపట్నం:ఫిబ్రవరి13(మనవార్త ప్రతినిధి)** సరోజిని నాయుడు జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మొలంగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ అన్నారు.శుక్రవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ,, శ్రీమతి సరోజిని నాయుడు సేవలను కొనియాడారు.భారత స్వతంత్ర పోరాటంలో ఆమె చూపిన తెగువ ధైర్య సాహసాలు చాలా స్ఫూర్తి దాయకం అని ప్రశంసించారు.ఆమె రచించిన పద్యాలను గుర్తు చేస్తూ మన స్వతంత్ర భారతదేశములో మొట్ట మొదటి మహిళ గవర్నర్ గా కూడా పని చేశారని గుర్తు చేశారు.వారి తల్లి కూడా సరోజిని లాగే గొప్ప కవయిత్రి అని తెలియచేశారు.అందుకే దేశవ్యాప్తంగా కూడా ఆమె జయంతినీ జాతీయ మహిళా దినోత్సవంగా కూడా జరుపుకుంటున్నామని తెలియచేశారు.పాఠశాలలో డ్రాయింగ్,ఉపన్యాస,వ్యాసరచన,పోస్టర్ రూపకల్పన లాంటి వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులను తగిన శిక్షణ ఇచ్చి ప్రేరేపించిన పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశ్ ముఖ్ ను శాలువతో సత్కరించి ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ బాబు,ఆదిలక్ష్మి,శారద, భాగ్యలక్ష్మి,సునీత,సరిత సుమలత పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరిలో భక్తి భావన పెరగాలి...



**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 13( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం ప్రతిష్ట నిర్వహించేందుకు స్థానిక సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దేవాలయ పునర్నిర్మాణ కోసం రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామీజీ దేవాలయాన్ని సందర్శించి పలు సూచనలు సలహాలు తెలియచేశారు, హనుమాన్ దేవాలయానికి వచ్చిన పీఠాధిపతి కి ఆలయ పూజారి సంతోష్ కుమార్ పూర్ణకుంబంతో స్వాగతం పలికారు, అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని సోమేశ్వర స్వామి దేవాలయం పునః ప్రతిష్టతో పాటు హనుమాన్ దేవాలయ పునః ప్రతిష్ట కార్యక్రమానికి భక్తులు ధన రూపేన వస్తు రూపేనా సహకారాలు అందించాలని, మానవుడి మనసులో ఉన్నటువంటి దివ్యమైన భగవత్ జ్యోతిని వెలిగిస్తే ఆ వెలుతురు బయటకు వస్తే మనలో నుండి వెలిగిన దీపమే ప్రేమ అనే కాంతి కనిపిస్తుందని, ప్రేమ అనే కాంతి పరోపకారమనేటువంటి ఒక జీవన విధానం ఉంటే అంతకుమించి ప్రపంచంలో కావాల్సింది ఏది లేదని ప్రతి ఒక్కరికి దేవతత్వం పరోపకార తత్వం కలిగే విధంగా ఆ సోమేశ్వర స్వామి ప్రసాదించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్, అక్షయ్ గౌడ్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, జాల రవికుమార్, వనం నర్సింలు, ఎల్లబోయిన యాదగిరి, సత్యనారాయణ రెడ్డి, తుమ్మ శంకర్, చిప్ప కృష్ణ, బలరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రలో శుక్రవారం సభ



**శంకరపట్నం:ఫిబ్రవరి13(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలం లింగాపూర్ అంగన్వాడి సెంటర్ లో ఐసీడీఎస్ సూపర్వైజర్ పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ,,గర్భిణీ,బాలింతలు తీసుకోవలసిన పోషకాహారం,తగు జాగ్రత్తల గురించి వివరించారు.అలాగే పిల్లల శారీరక మానసిక ఆరోగ్యానికి సరైన పోషణ అవసరం అని అన్నారు.ఉప్పు,చక్కెర వినియోగాలు తగ్గించాలని,రెండు సంవత్సరాలలోపు పిల్లలకు ఉప్పు వాడకుండా ఉంటే మంచిదని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అజయ్,అంగన్వాడీ టీచర్లు,ఆయాలు ఆశలు,పిల్లలు పాల్గొన్నారు.

# సర్పంచ్ ముద్దుల రాజిరెడ్డిని సన్మానించిన కొండూరు గాంధీ



**గంభీరావుపేట మన వార్త ప్రతినిధి ఫిబ్రవరి 13** గంభీరావుపేట మండలంలోని నాగంపేట గ్రామ సర్పంచ్ ముద్దుల రాజిరెడ్డి నీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండూరు గాంధీ గురువారం గురువారం శాలువా కప్పి సన్మానించారు సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ నవీన్ కుమార్ వాడు సభ్యులు మాజీ ఎంపీపీ నర్రా అంజిరెడ్డి రాజిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు


# ప్రజలను మెప్పించేవిధంగా కాంగ్రెస్ పాలన సాగాలి

**-నిస్వార్థమైన సేవ, పారదర్శక పాలన అందించాలి...**
**-ముస్లిం ఐక్య సంఘం నేతలు మౌలానా షేక్ ముజాహిద్-షేక్ హుస్సేన్...**
**-13వ వార్డు విజేత షేక్ రషిదున్ కి శుభాకాంక్షలు తెలిపిన ఐక్య సంఘం నేతలు...**



**మధిర, ఫిబ్రవరి 13( మన వార్త):**మధిర మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ కుటమి 21స్థానాల్లో విజయం సాధించి అజేయ శక్తిగా నిలిచిందని,డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధికి ప్రజలు మద్దతుగా నిలిచారని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ సాహెబ్ అన్నారు.శుక్రవారం మధిర మున్సిపాలిటీ 22 వార్డులకు వెలువడిన ఎన్నికల ఫలితాల్లో తెలంగాణ ముస్లిం సంఘం ఐక్య సంఘం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ 13వ వార్డు అభ్యర్థి షేక్ రషిదున్ 254 ఓట్ల మెజార్టీతో విజయం సాధించటంతో ఆమెకి ఐక్య సంఘం శుభాకాంక్షలు తెలిపింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డు కౌన్సిలర్ గా గెలిచిన అభ్యర్థులు నిస్వార్ధంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని అన్నారు.అనంతరం 13వ వార్డులో గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి షేక్ రషిదును మాట్లాడుతూ, తనకు ఓట్లు వేసి ఇంతటి ఘన విజయాన్ని అందించిన 13వ వార్డు ప్రజలకి,కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి ప్రోత్సహించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి,తనకి మద్దతు ప్రకటించిన తెలుగుదేశం, ముస్లిం ఐక్య సంఘంనికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సయ్యద్ రషీద్, షేక్ హైదర్, షేక్ గాలిబ్, దుంప వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల విజయం చైర్మన్ పీఠం ఖాయం...



**రామయంపేట ఫిబ్రవరి 13 ( మన వార్త ప్రతినిధి)** రామాయంపేట మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి చైర్మన్ అభ్యర్థి గజవాడ లావణ్య నాగరాజు ను అధిష్టానం ప్రకటించడంతో ఒకటో వార్డు నుండి లావణ్య బరిలో ఉండగా ఏడవ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా తన భర్త నాగరాజు బరిలో నిలిచారు రామయంపేట మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థుల గెలుపు కోసం ఎనలేని కృషి చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ మాజీ ఎమ్మెల్యే మదనపల్లి హనుమంతరావు సహకారంతో చేపట్టిన అభివృద్ధి సేవ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశారు, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని ఎక్కడలేని విధంగా రామాయంపేట మున్సిపాలిటీని అభివృద్ధి పరుస్తూ ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ప్రజలకు హామీ ఇచ్చారు """పట్టు పట్టారు గెలుపు గెలిచారు""" లావణ్య నాగరాజు 12 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు తన భుజస్కందాలపై వేసుకొని కష్టపడ్డారు భార్యాభర్తల విజయంతో పాటు మరో ఆరు వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని చైర్మన్ పదవి దక్కించుకున్నారు, ఓవైపు లావణ్య నాగరాజుకు ఉన్న మంచి పేరు మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు చేపట్టిన సేవా కార్యక్రమాలు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు వారి గెలుపుకు నాంది పలికాయి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విజయం రామయంపేట మున్సిపాలిటీ ప్రజల విజయమని ఇచ్చిన మాట ప్రకారం తప్పకుండా పనులు చేపడతామని అభివృద్ధి చేసి చూపిస్తామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారాలతో రామాయంపేట మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తామని వారన్నారు గెలుపుకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి కృతజ్ఞతలు



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం మడిపల్లి గ్రామం నుండి ఎల్కతుర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జంక్షన్ వరకు 5 కిలోమీటర్ల పొడవున డబుల్ లేన్ బీటీ రహదారి నిర్మాణానికి రూ.13.00 కోట్ల పరిపాలనా అనుమతి లభించిందని హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షులు గొర్రె మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రత్యేక కృషి పట్టుదల ఫలితంగానే ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు జీవో నెంబర్.205 శుక్రవారం రోజున మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఈ పరిపాలనా అనుమతిని జారీ చేసినట్లు వెల్లడించారు.ఈ రహదారి నిర్మాణ పనులను కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (KUDA) వరంగల్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారి అభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా వ్యాపార విద్యా మరియు అత్యవసర సేవల రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు.ప్రాంత అభివృద్ధి పట్ల ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గొర్రె మహేందర్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని ఆయన ఆకాంక్షించారు.

# మద్యం సేవించి వాహనాన్ని నడిపిన ఇద్దరు (02) వాహనదారులకి (02) రోజుల జైలు శిక్ష




**సిద్దిపేట జిల్లా, ఫిబ్రవరి 13, మన వార్త ప్రతినిధి** సిద్దిపేట ట్రాఫిక్ సీఐప్రవీణ్, కుమార్, తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 11మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా ఫిబ్రవరి. 13-ఫిబ్రవరి- రోజున సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 11 మంది వ్యక్తులలో (02)ఇద్దరికీ చెరి (02) రెండు రోజుల జైలు శిక్ష మిగతా 09 మందికి రూ.92,000- జరిమానావిధించారు.డ్రైవింగ్ లైసెన్స్ లేని ముగ్గురు వ్యక్తులకి ఒక్కొక్కరికి రూ. 5,000- చొప్పున మొత్తం రూ. 15,000- జరిమాన విధించినారు.జైలు శిక్ష విధించినవ్యక్తివివరాలు1.ఆరెల్లి అనుదీప్, వయసు 36 సం, వృత్తి. బొలెరో డ్రైవర్, నివాసం వరంగల్ పట్టణం. రెండు రోజులు జైలు.2. గుండమైన స్వామి, 53 సం, వృతి. హమాలీ, నివాసం. నాసర్ పుర, సిద్దిపేట పట్టణం. రెండు రోజులు జైలు.డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000- రూపాయల జరిమానా విధించడంజరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## అందుబాటులో యూరియా రైతులు ఆందోళన చెందవద్దు

**– జిల్లా వ్యవసాయ శాఖ అధికారి:భాగ్యలక్ష్మి...**

**శంకరపట్నం:ఫిబ్రవరి13(మనవార్త ప్రతినిధి)** శంకరపట్నం మండలంలో జనవరి 31నుంచి 2,718 మంది రైతులు 8,895 యూరియా బస్తాలను బుక్ చేసుకొని,7,880 బస్తాలను కొనుగోలు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు.ఇవి యాప్ కన్నా ముందు చేసిన కొనుగోళ్లకు అదనంగా సరఫరాచేసినవని,రైతుల అవసరాన్ని,ఆందోళనను దృష్టిలో పెట్టుకుని మండలంలో శుక్రవారం 160 మెట్రిక్ టన్నులు (3600 బస్తాలు)యూరియా తాడికల్,మెట్ పల్లి, కన్నాపూర్,గద్దపాక,మొలంగూర్,ముత్తారం, కాచాపుర్,కొత్తగట్టు,సొసైటీలలో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.ప్రైవేట్ డీలర్ ల ద్వారా కూడా గురువారం 590 బస్తాలు రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు.కావున మండలంలోని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.అవసరానికి తగ్గట్టుగా యూరియా కొనుగోలు చేయాలని ముందస్తు కొనుగోళ్లు చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారీ భాగ్యలక్ష్మి,ఏడీఏ శ్రీధర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.యాప్ లో బుకింగ్ చేయడంలో ఇబ్బంది ఉన్న రైతులు సంబంధిత ఏఈఓ లేదా సంబందించిన సొసైటీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## ఎల్కతుర్తి మండలంలో విషాదం



**ఎల్కతుర్తి ఫిబ్రవరి 13 మన వార్తా ప్రతినిధి** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్పూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెండ్యాల సాంబరాజు (39) అనే యువకుడు గోడకూలి మృతి చెందాడు.స్థానికుల కథనం ప్రకారం, గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ఇంటి అడ్డంగా ఉన్న మట్టి గోడకు ఆనుకొని సాంబరాజు తన భార్య, కూతురుతో కలిసి మంచం వేసుకుని నిద్రిస్తున్నాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా మట్టి గోడకూలి వారిపై పడింది. గోడ నేరుగా సాంబరాజుపై పడటంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. భార్య, కూతురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.ఘటన గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సాంబరాజు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి ఆయనే ఆధారం అని గ్రామస్తులు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## పెబ్బేరు మున్సిపల్ పోరులో కాంగ్రెస్ హవా



**పెబ్బేరు.ఫిబ్రవరి13 (మన వార్త ప్రతినిధి)**మున్సిపల్ ఫలితాల్లో హస్తం హవా దూసుకుపోయింది! ఎన్నికలు ఏవైనా.. గెలుపు కాంగ్రెస్ దేనని మరోసారి రుజువైంది! రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని దీవించిన ప్రజలు... మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నేడు మున్సిపల్ ఎన్నికల్లో అపూర్వ.. అఖండ విజయాన్ని అందించారు! తమ విశిష్ట తీర్పుతో.. స్థానిక పాలనాపగ్గాలను కూడా కాంగ్రెస్ దళాలకే అప్పజెప్పారు! తన పట్టు సడలలేదని నిరూపించుకున్న కాంగ్రెస్.. శుక్రవారం వెల్లడైన మున్సిపల్ ఫలితాల్లో పెబ్బేరు మున్సిపాలిటీ ఎన్నికల్లో 12స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 07 స్థానాల్లో ఘనవిజయం సాధించింది! పటిష్ఠమైన క్యాడర్ కాంగ్రెస్ సొంతం తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన పెబ్బేరు రెండో మున్సిపల్ పోరు ఇదే కావటం ఈ ఎన్నికల ప్రత్యేకత. తమది తెలంగాణ తెచ్చిన ఘనత అని చెప్పుకొనే బీఆర్ఎస్ ఒకవైపు, ప్రత్యామ్నాయం తామేనని జబ్బలు చరుచుకుంటున్న బీజేపీ మరోవైపు నిలువగా...ఈ రెండు పార్టీలకు ప్రజాపాలన తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని హస్తం పార్టీ సవాలు విసిరింది. తెలంగాణ మూలాల్లోకి విస్తరించి ఉన్న కాంగ్రెస్ క్యాడర్ శక్తి ముందు.. బీఆర్ఎస్, కమలం దారుణ ఓటమిని మూటగట్టుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ గత పదేళ్లుగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నది. వాటన్నింటినీ లెక్కచేయకుండా రేవంత్ రెడ్డి సారథ్యంలో ముందుకు వెళ్లింది.ఈ క్రమంలోనే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సర్కార్ రావడంతో గట్టి పునాదులేసుకున్నది. అప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైంది. అసెంబ్లీ, ఎమ్మెల్సీ, ఎంపీ,పంచాయతీ, ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తూ వస్తున్నప్పటికీ.. మున్సిపాలిటీలో బలమెంత? అనే అనుమానాలు ఉండేవి. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ.. కాంగ్రెస్ తెలంగాణ ఇంటిపార్టీ అని, రాష్ట్రమంతటా పార్టీకి దృఢమైన మూలాలు ఉన్నాయని తెలంగాణ ప్రజలు నిరూపించారు.మున్సిపల్ ఎన్నికల్లో ఏకపక్షంగా తీర్పు చెప్పి తాము కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పక్షమేనని నినదించారు.ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసిన కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులు...పెబ్బేరు మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్లుగా ఎన్నికైన 7మంది కౌన్సిలర్ అభ్యర్థులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే వారికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. పెబ్బేరు మున్సిపాలిటీలో 7 కౌన్సిలర్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ.. ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. పెబ్బేరు పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### మహిళా సంఘ భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్...



**చిన్న శంకరంపేట ఫిబ్రవరి 13 ( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండలం అంబాజీపేట గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ సుంకరి సబితా రవీందర్ గౌడ్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా 10 లక్షలు మంజూరి చేయడం జరిగిందని ఆమె అన్నారు భవన నిర్మాణానికి సహకరించిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సబితా రవీందర్ గౌడ్ తో పాటు ఉపసర్పంచ్ రాజు, పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, పంచాయతీరాజ్ శాఖ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

### పంజాల రవి గౌడ్ ఆధ్వర్యంలో నాయిని యాదగిరికి ఘన సన్మానం



**గజ్వేల్ ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 16వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన నాయిని సత్యలక్ష్మి యాదగిరి ఘన విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు పంజాల రవి గౌడ్ ఆధ్వర్యంలో నాయిని యాదగిరి సత్యలక్ష్మికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి ప్రజల సమస్యల పట్ల ప్రతినిత్యం పోరాడి వారి ప్రేమ ఆదరణ పొంది కౌన్సిలర్ గా గెలుపొందడం సంతోషంగా ఉందని వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేయడం జరిగిందని అన్నారు

## అనంతారం పాఠశాలలో ఆంగ్ల భాష దినోత్సవం..



**–విద్యార్థులకు కథ,వ్యాసరచన,డ్రాయింగ్,పోస్టర్ పోటీలు...**

**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 13 (మన వార్త ప్రతినిధి):**ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సరోజినీ నాయుడు జన్మదిన సందర్భంగా ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,సరోజిని నాయుడు జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో,శ్రీమతి సరోజిని నాయుడు సేవలను కొనియాడుతూ,భారత స్వతంత్ర పోరాటంలో ఆమె చూపిన తెగువ,ధైర్యం,సాహసాలు ఎంతో స్ఫూర్తిదాయకమని గుర్తుచేశారు.ఆమె రచించిన పద్యాలను,స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి మహిళ గవర్నర్‌గా కూడా పనిచేశారని ప్రత్యేకంగా గుర్తుచేశారు.అలాగే,వారి తల్లి కూడా సరోజిని లాగే గొప్ప కవయిత్రి అని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఆమె జయంతినీ జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నది కూడా తెలియజేశారు.కార్యక్రమంలో విద్యార్థుల కోసం డ్రాయింగ్,ఉపన్యాస,వ్యాసరచన,పోస్టర్ రూపకల్పన వంటి వివిధ పోటీలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పాఠశాలలో ఇంగ్లీష్ బోధన చెప్పే కవిత టీచర్ ను శాలువాతో సన్మానించి,టీచర్ బోధన వల్లే విద్యార్థులు ఇంగ్లీషులో మండల,జిల్లా స్థాయిలలో ఎన్నో ప్రథమ స్థానాలను సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు మరియు గ్రామానికి ఎంతో గర్వాన్ని ఇచ్చాయని తెలిపారు.అనంతరం కవిత మేడం మాట్లాడుతూ,విద్యార్థులు ఇంగ్లీష్ భాషలో తమ నైపుణ్యాలను మెరుగుపరచడం,సృజనాత్మకతను ప్రదర్శించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.పోటీల్లో సాధించిన విజయం వారి శ్రద్ధ మరియు సాధన ఫలితం అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పి.ఎస్ హెచ్ఎం సత్యనారాయణరెడ్డి,ఉపాధ్యాయులు పాఠశాల సహాయకులు జమున,ఖుద్దుస్,ప్రవీణ్,శ్రీదేవి,నర్సయ్య,పద్మ తో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### కౌన్సిలర్లుగా గెలుపొందిన అభ్యర్థులకు హృదయపూర్వక శుభాకాంక్షలు...

**–రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఈ ఫలితాలే నిదర్శనం. ..**

**–ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య...**



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్తా జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు , యాదగిరిగుట్ట మున్సిపాలిటీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గెలిచిన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ , బీజేపీలు కలిసి వచ్చినా కాంగ్రెస్‌ను ఎక్కడా తట్టుకోలేకపోయాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఈ ఫలితాలే నిదర్శనం అన్నారు. పేదల సంక్షేమం , రైతుల అభ్యున్నతి , యువతకు అవకాశాలు కల్పించడం , ముఖ్యంగా తెలంగాణలో మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వంగా మా ప్రభుత్వం నిలిచిందని..అందుకే ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారన్నారు.ఈ విజయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంకితం చేస్తున్నాను. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆరు మున్సిపాలిటీలను భారీ మెజారిటీతో గెలిపించడం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా ఆలేరు నియోజక వర్గంలోని మున్సిపాలిటీల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభించింది. బీఆర్ఎస్ , బీజేపీలు ఎక్కడా పోటీ ఇవ్వలేకపోయాయి అంటే మా ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల విశ్వాసం స్పష్టంగా తెలుస్తోంది. ఈ నమ్మకంతోనే ఈ ఆరు మున్సిపాలిటీలను ముఖ్యమంత్రి సహకారంతో భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తాము. గత రెండేళ్లలో చేసిన పనులను చూసి ప్రజలు మాకు ఈ గొప్ప విజయాన్ని అందించారు. రాబోయే జెడ్పిటిసి , ఎంపిటిసి ఎన్నికల్లో కూడా 90 శాతం పైగా సీట్లు గెలుచు కుంటామనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనం. మా రేవంత్ అన్న నాయకత్వంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. యాదాద్రి భువనగిరి జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తాము. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాము. ఈ విజయానికి సహకరించిన నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఉత్తమ్ కుమార్ రెడ్డి , చామల కిరణ్ కుమార్ రెడ్డి అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నమన్నారు. ఇంతటి విజయాన్ని అందించిన ప్రజా నీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య. ఈ కార్యక్రమంలో ఆరు మున్సిపాలిటీల నాయకులు సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో చోరీ కేసు 48 గంటల్లో నిందితుడి అరెస్ట్



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఫిబ్రవరి 13 మన వార్త :**అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఘటన వివరాలు ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 309(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.12-02-2026 సాయంత్రం 5:30 గంటల సమయంలో, వెంకటాపురం పీజేఆర్ విగ్రహం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.తనిఖీలో నిందితుడు అల్లాడి సుభాష్ గౌడ్ (26)వృత్తి మొబైల్ సర్వీస్ టెక్నీషియన్ నివాసం మీర్‌పేట్, హైదరాబాద్ అని గుర్తించారు.స్వాధీనం చేసుకున్న వస్తువులు సుమారు 14 గ్రాముల బంగారు గొలుసు నేరానికి ఉపయోగించిన పల్సర్ 150 బైక్ (TS32E0159)నిందితుడు ఉపయోగించిన రెడ్మీ మొబైల్ ఫోన్‌పోలీసులు నిందితుడిని 12-02-2026 రాత్రి 8:00 గంటలకు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.ఒంటరిగా నివసించే వృద్ధులు అపరిచిత వ్యక్తులను ఇంట్లోకి అనుమతించే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అల్వాల్ పోలీసులు సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

### చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నేపథ్యంలో తేదీ 16 వరకు 163,144 సెక్షన్ అమలు...



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13**జిల్లాలోని భువనగిరి , ఆలేరు , యాదగిరిగుట్ట , పోచంపల్లి , చౌటుప్పల్ , మోత్కూర్ మున్సిపాలిటీ లలో చైర్ పర్సన్ , వైస్ చైర్ పర్సన్ పరోక్ష ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ వరకు జిల్లాలో భారతీయ నాగరిక సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (144) అమల్లో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల నియమావళి (ఎంసిసి) ప్రకారం జిల్లాలో కఠినంగా అమలులో కొన సాగుతుందని ప్రశాంతంగా , నిర్భయంగా , పారదర్శకంగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలో భాగంగా సెక్షన్ 163ను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులకు ముందస్తు అనుమతి లేకుండా ఏ ప్రజా లేదా ప్రైవేట్ ప్రదేశంలో ముగ్గురికి మించి వ్యక్తులు గుమి కూడరాదని స్పష్టం చేశారు. అనధికార సమావేశాలు , శిబిరాలు , ర్యాలీలు , ప్రదర్శనలు నిర్వహించడం , ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే విధంగా గుంపులు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. జిల్లాలోఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.అలాగే ప్రైవేట్ వాహనాలు , టూర్ వాహనాలు లేదా ఇతర మార్గాల ద్వారా ముందస్తు అనుమతి లేకుండా ప్రదర్శనలు , ర్యాలీలు నిర్వహించడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణించ బడుతుందని పేర్కొన్నారు.ప్రజలు , రాజకీయ నాయకులు ఎన్నికల నియమాలను గౌరవించి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు.

## గుండారం గుట్టల వైపు పులి సంచారం..




**ఇల్లంతకుంట,ఫిబ్రవరి 13 (మన వార్త ప్రతినిధి):**బెజ్జంకి మండలం గుండారం గ్రామ ప్రాంతంలో పులి సంచరించిన నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇల్లంతకుంట మండల స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్ శుక్రవారం సూచించారు.ఇటీవల సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని కోహెడ మండలం ఆరపల్లి వైపు పులి సంచారం జరుగుతున్నట్టు ప్రచారం రావడంతో,శుక్రవారం రోజున బెజ్జంకి మండలంలోని గుండారం గుట్టల ప్రాంతంలో పులి సంచరించినట్లు విచారణ వచ్చిన సందర్భంగా,గుండారం ప్రక్కన ఉన్న గ్రామాలకు ఎస్సై సిరిసిల్ల అశోక్ ప్రత్యక్షంగా వెళ్లి తాళ్లల్లపల్లె,రేపాక,ఆరేపల్లి చుట్టూ నివసిస్తున్న గ్రామవాసులకు అప్రమత్తంగా ఉండమని,పశువులను ఇంటివద్దే కట్టేయమని,చిన్న పిల్లలు,మహిళలు,వృద్ధులు జాగ్రత్తగా ఉండమని సూచించారు.పంట పొలాల దగ్గర ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

## రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఈ ఫలితాలే నిదర్శనం



**యాదాద్రి భువనగిరి జిల్లా మన వార్త జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 13** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి , భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో అత్యంత మెజార్టీ స్థానాల్లో గెలిచిన సభ్యులందరికీ ఉదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ , బీజేపీలు కలిసి ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్‌ను ఎక్కడా ఓడించలేకపోయాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అభివృద్ధికి ఈ ఫలితాలే గొప్ప నిదర్శన మని ప్రజా పాలనకు ప్రజలే పట్టం కట్టారన్నారు. పేదల సంక్షేమం , రైతుల అభ్యున్నతి , యువతకు అవకాశాలు కల్పించడం , ముఖ్యంగా తెలంగాణలోని మహిళలను కోటీశ్వరులను చేయడానికి పెద్దపీట వేసిన ప్రభుత్వంగా మా ప్రభుత్వం నిలిచిందని..అందుకే ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారన్నారు. ఈ విజయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంకితం చేస్తున్నామన్నారు. రెండు మున్సిపాలిటీలను భారీ మెజారిటీతో గెలిపించడం నాకు ఎంతో ఆనందాన్ని కల్పించిందని అన్నారు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభించిందన్నారు. బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలు ఎక్కడ కూడా పోటీ ఇవ్వలేకపోయాయి అంటే మా ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల పూర్తి విశ్వాసం స్పష్టంగా తెలియపరిచారు. ఈ నమ్మకంతోనే ఈ రెండు మున్సిపాలిటీలను ముఖ్యమంత్రి సహకారంతో భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తామని , గత రెండేళ్లలో చేసిన పనులను చూసి ప్రజలు మాకు ఈ గొప్ప విజయాన్ని అందించారు. రాబోయే జెడ్పిటిసి , ఎంపిటిసి ఎన్నికల్లో కూడా 80 శాతం పైగా సీట్లు గెలుచు కుంటామనే ధీమాను వ్యక్తం చేస్తున్నామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప ఆశీర్వాదం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనకు ఈ ఫలితాలు నిదర్శనం. మా రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తాం. యాదాద్రి భువనగిరి జిల్లాకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని , ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తాము. ఈ విజయానికి సహకరించిన నాయకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నమన్నారు. ఇంతటి విజయాన్ని అందించిన రెండు మున్సిపాలిటీల ప్రజా నీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి. ఈ కార్యక్రమంలో రెండు మున్సిపాలిటీల నాయకులు సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహా జాతరకు సర్వం సన్నద్ధం: ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేములవాడ, ఫిబ్రవరి 13 (మన వార్త)**ప్రసిద్ధ దక్షిణ కాశీ క్షేత్రం వేములవాడలో ఈ నెల 14, 15,16 తేదీల్లో మహాశివరాత్రి జాతర వేడుకలు వైభవోపేతంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. జాతర సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, జాతర నిర్వహణలో పాల్గొంటున్న సంబంధిత శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. జాతర గ్రౌండ్ పరిసరాలు, శివార్చన స్టేజ్, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టాయిలెట్లు, చలువ పందిళ్లు, జల ప్రసాదం పంపిణీ కేంద్రాలు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయాలు, భీమేశ్వర దేవాలయం పరిసరాలు, భక్తులకు మార్గదర్శనం చేసే సూచిక బోర్డులు, షవర్స్, అదనంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, కమాండ్ కంట్రోల్ రూమ్, తదితర ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. భక్తులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీసి, అవసరమైన చోట్ల తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. షిఫ్ట్‌ల వారీగా సిబ్బంది ఉండాలని అన్నారు. త్రాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు నిరంతరంగా అందుబాటులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. మహాశివరాత్రి జాతరను శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. పరిశీలనలో ఆర్డీఓ రాధాభాయి, ఈఓ రమాదేవి, డీఆర్డీఓ గీత, ఆర్ & బి ఈఈ నరసింహ చారి, పంచాయత్ రాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ కిషోర్, సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, ఆలయ ఈఈ రాజేష్, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ అన్వర్, ఇంట్రా ఈఈ సుమలత, తహసీల్దార్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్ ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి - 13 (మన వార్త)**మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ సెంటర్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలోని సినారె కళామందిరాల్లో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా, వెబ్ కాస్టింగ్ సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు. పరిశీలనలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, ఈడీఎం శ్రీనివాస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నరాల శేఖర్,ఇండిపెండెంట్ అభ్యర్థులు కుమ్మరి



**వేములవాడ ఫిబ్రవరి 13 (మన వార్త)**మున్సిపల్ ఎన్నికల్లో విజయడంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ లో చేరికల పర్వం కొనసాగుతుంది.. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో గెలుపొందిన బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ నరాల శేఖర్,ఇండిపెండెంట్ అభ్యర్థులు కుమ్మరి శిరీష శ్రీనివాస్, ఎల(టైలర్) శ్రీనివాస్ లు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ప్రభుత్వ విప్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు..ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల విశ్వాసం రోజు రోజుకు పెరుగుతోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు ప్రజల మార్పు ఆకాంక్షకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. అభివృద్ధి, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు...

## మాతృభాషతోపాటు ఇతర భాషల్లో రాణించాలి...



**వేములవాడ ఫిబ్రవరి 13 (మన వార్త )** శుక్రవారం ప్రాథమిక పాఠశాల ఎస్సీ కాలనీ మరిగడ్డలో స్వాతంత్ర సమరయోధురాలు భారత కోకిల సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆంగ్ల భాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ భాష యొక్క గొప్పతనము ఆ బాషా ఏ విధంగా అభివృద్ధి చెందింది అనే విషయాలతో పాటు మనదేశంలో ఆంగ్లభాష ప్రవేశపెట్టడం వలన ప్రపంచ సాహిత్యం మనకు తెలియడమే కాకుండా మన యొక్క సంస్కృతి ఇక్కడ ఉన్న సాహిత్యం ఇతర దేశాలకు పరిచయం అయింది అనే విషయాలను విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాజా గౌడ్ ఆధ్వర్యంలో నక్క రాములు గౌడ్ కు ఘన సన్మానం




**గజ్వేల్ ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి నక్క సంతోషి రాములు గౌడ్ ఘన విజయం సాధించారు శుక్రవారం గజ్వేల్ పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు రాజగౌడ్ ఆధ్వర్యంలో నక్క సంతోషి రాములు గౌడ్ కు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు అనంతరం రాజగౌడ్ మాట్లాడుతూ కౌన్సిలర్ అభ్యర్థిగా గెలుపొందిన నక్క సంతోషి రాములు గౌడ్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తూ ప్రజల్లో మంచి ఆదరణ పొంది ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా వారికి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అన్నారు.

## 14వ వార్డు ప్రజల విజయమిది



**గజ్వేల్, ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించిన గుంటుకు లక్ష్మి శ్రీనివాస్ వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆశీస్సులతో, వార్డు ప్రజల అండదండలతో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ గెలుపును 14వ వార్డు ప్రజలకే అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి, పరిష్కరించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో రాత్రింబవళ్లు కష్టపడి తన గెలుపు కోసం సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మరియు శ్రేయోభిలాషులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి అత్తెల్లి శ్రీనివాస్ ఘనవిజయం



**గజ్వేల్ ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ 20వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థిగా అత్తెల్లి శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు, శుక్రవారం గజ్వేల్ లో కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, నా మీద నమ్మకంతో 20 వ వార్డు ప్రజలు నా మీద నమ్మకంతో నాకు ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా 20 వార్డు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని, నా మీద అభిమానంతో నన్ను గెలిపించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు రాబోయే కాలంలో 20వ వార్డు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు, ఈ విజయం 20 వ వార్డ్ ప్రజలకు అంకితం అని అన్నారు

## 6 వ వార్డ్ కౌన్సిలర్ గా బొగ్గుల స్వప్న సురేష్ ఘన విజయం



**గజ్వేల్ ఫిబ్రవరి 13 మన వార్త ప్రతినిధి** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిగా బొగ్గుల స్వప్న సురేష్ ఘనవిజయం సాధించారు శుక్రవారం గజ్వేల్ పట్టణంలో కౌన్సిలర్ బొగ్గుల స్వప్న సురేష్ మాట్లాడుతూ మా విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ బిఆర్ఎస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి మాకు ఓటు వేసి మమ్మల్ని గెలిపించిన ప్రతి ఒక్క ఓటర్ మహాశయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ రాబోయే రోజుల్లో 6 వ వార్డ్ ఆదర్శ వార్డ్ గా మారడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు

## చేగుంటలో ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ నిర్వహణ



**చేగుంట ఫిబ్రవరి 13 ( మన వార్త ప్రతినిధి)** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల కల్పనతో పాటు అభివృద్ధి పనుల అమలులో పారదర్శకత నిధుల సక్రమ వినియోగాన్ని నిర్ధారించేందుకు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ సామాజిక తనిఖీ కార్యక్రమం చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అడిషనల్ డీఆర్డీఓ రంగాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మండల పరిధిలో అమలవుతున్న ఉపాధి హామీ పనులపై సమగ్ర పరిశీలన చేపట్టారు. గ్రామాల వారీగా చేపట్టిన చెరువుల పూడికతీత, చెక్‌డ్యాంల నిర్మాణం, పల్లెప్రకృతి వనాల అభివృద్ధి, మట్టి పనులు, అంతర్గ్రామ రహదారి మరమ్మత్తులు, నీటి సంరక్షణ పనులు తదితర కార్యక్రమాల వివరాలను రికార్డులతో సరిపోల్చి తనిఖీ చేశారు. జాబ్ కార్డుల జారీ, కార్మికుల హాజరు నమోదు, ఆన్‌లైన్ డేటా ఎంట్రీలు, ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్లు, బ్యాంక్ ఖాతాల ద్వారా వేతనాల చెల్లింపుల పరిస్థితులను సమీక్షించారు. వేతనాలు నిర్ణీత గడువులో కార్మికుల ఖాతాల్లో జమ అవుతున్నాయా లేదా అన్న అంశంపై ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల నాణ్యత, ఫోటో అప్లోడ్లు, జియో ట్యాగింగ్, మెజర్‌మెంట్ బుక్స్ నమోదు తదితర అంశాలను పరిశీలించారు. సామాజిక తనిఖీ సందర్భంగా గ్రామాల నుంచి హాజరైన కార్మికుల అభ్యంతరాలు, సూచనలు నమోదు చేశారు. కొన్ని గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యల సూచనలు ఇచ్చారు. గుర్తించిన లోపాలను సరిదిద్దేలా మార్గదర్శకాలు జారీ చేశారు. పథకం అమలులో పారదర్శకత, ప్రజాపాలుపంచుకోవడం, బాధ్యతాయుత విధానం అమలు చేయడంలో సామాజిక తనిఖీలు కీలకమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎస్ఆర్పి నరేందర్, హెచ్ఆర్ రాజేందర్ రెడ్డి, ఏపీఓ శ్వేత తదితరులు పాల్గొన్నారు

## గజ్వేల్ లో ఎస్సీలకు వైస్ చైర్మన్ ఇవ్వాలి...



**సిద్దిపేట జిల్లా, ఫిబ్రవరి 13, మన వార్త ప్రతినిధి**గజ్వేల్ లో మున్సిపాలిటీ ఎస్సీలకు వైస్ చైర్మన్ ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరుడి స్వామి,మాట్లాడుతూ గతంలో పది సంవత్సరాల నుండి మున్సిపాలిటీ ఎన్నికలు జరిగాయి ఒకసారి బీసీ బిడ్డ మున్సిపల్ చైర్మన్ ఓసి లక్కీ వైస్ చైర్మన్ రెండోసారి మున్సిపల్ గెలిచిన తర్వాత ఓసీలకు చైర్మన్ మైనార్టీలకు వైస్ చైర్మన్ గా వచ్చినాయి ఈసారి బిసి ఉమెన్ మహిళా చైర్మన్ గా వచ్చింది కాబట్టి ఎస్సీలకు ఇప్పటివరకు ఎలాంటి సముచిత స్థానం కల్పించలేదని టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండుసార్లు మున్సిపల్ వచ్చి గాని దళితులకు ఇచ్చిన హామీలు ఏది నెరవేర్చలేదని మున్సిపాలిటీలో గాని స్థానాల్లో కల్పించలేదు ఇప్పటికైనా టిఆర్ఎస్ పార్టీ కండ్లు తెరుచుకొని గజ్వేల్ మున్సిపాలిటీలో ఎస్సీలకు వైస్ చైర్మన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

## స్వతంత్రులుగా అన్నా చెల్లి ఘన విజయం..




**జమ్మికుంట, ఫిబ్రవరి 13( మన వార్త ప్రతినిధి):**స్వతంత్ర అభ్యర్థులుగా సొంత అన్నా చెల్లెలు భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. పట్టణానికి చెందిన ములుగు ప్రణీత బీ ఆర్ ఎస్ కౌన్సిలర్ గా నిరుడు బాధ్యతలు నిర్వహించారు. ఆమె అన్న ములుగు దిలీప్ అలియాస్ ప్రశాంత్ కుమార్ బీ ఆర్ ఎస్ నాయకులుగా కొనసాగారు. ప్రస్తుత రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో బీ ఆర్ ఎస్ నుండి టికెట్ ఆశించారు. టికెట్ రాకపోవడంతో 23 వార్డు నుండి దిలీప్, 24వార్డు నుండి ప్రణిత స్వతంత్రులుగా పోటీలో నిలిచారు. ఎన్నికల తరువాత శుక్రవారం వెలువడిన ఫలితాలలో అన్నా చెల్లి ఇద్దరు ఆయా వార్డులలో భారీ మెజారిటీతో విజయం సాధించారు. తన గెలుపుకు కారమైన ఆయా వార్డు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వార్డు అభివృద్ధికి పాటు పడుతూ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

## ఈత పండ్లు సహజ తీపి, శక్తినిచ్చే పోషకాహారం



**డెస్క్** సహజ తీపితో ప్రత్యేక గుర్తింపు ఈత పండ్లు (ఖర్జూరాలు) సహజ తీపితో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పండ్లుగా గుర్తింపు పొందాయి. తాజా ఈత పండ్లతో పాటు ఎండబెట్టిన ఖర్జూరాలు కూడా మార్కెట్‌లో విస్తృతంగా లభిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉపవాసకాలంలో, పండుగల సందర్భాల్లో ఈత పండ్ల వినియోగం ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. తక్కువ మోతాదులోనే ఎక్కువ శక్తిని అందించే గుణం ఈ పండ్ల ప్రత్యేకతగా నిలుస్తోంది. శక్తి, రక్తహీనత నివారణకు తోడ్పాటు ఈత పండ్లలో సహజ చక్కెరలు, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు ఉండటంతో శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అలసటగా అనిపించే వారికి ఈత పండ్లు ఉపశమనంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు. రక్తహీనత సమస్య ఉన్నవారికి కూడా పరిమితంగా ఈత పండ్లు మేలు చేస్తాయని సూచిస్తున్నారు. పిల్లలు, గర్భిణులు వైద్యుల సలహాతో తీసుకుంటే ఉపయోగకరమని నిపుణులు అంటున్నారు.జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు ఈత పండ్లలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణక్రియ మెరుగుపడుతుందని వైద్యులు చెబుతున్నారు. మలబద్ధకం సమస్య తగ్గించడంలో ఇవి సహాయపడతాయని పేర్కొంటున్నారు. అలాగే పొటాషియం ఉండటం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో తోడ్పడుతుందని సూచిస్తున్నారు. పరిమిత మోతాదులో తీసుకుంటే శరీరానికి అవసరమైన ఖనిజాలు సహజంగానే అందుతాయని నిపుణుల అభిప్రాయం. పరిమితిలో తీసుకోవాల్సిన అవసరం ఈత పండ్లు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, వీటిలో సహజ చక్కెరలు అధికంగా ఉండటంతో అతిగా తినడం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు పరిమితంగా మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. రోజుకు రెండు నుంచి మూడు ఈత పండ్లు సరిపోతాయని పేర్కొంటున్నారు. సరైన మోతాదులో తీసుకుంటే ఈత పండ్లు రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా అందించే సహజ ఆహారంగా నిలుస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తాటికల్లు గ్రామీణ జీవనంలో సంప్రదాయం జాగ్రత్తలతోనే మేలు



**డెస్క్,** తాటి చెట్టుతో ముడిపడిన జీవనం తాటి చెట్టు నుంచి సేకరించే తాటికల్లు (కల్లు) తెలుగు ప్రాంతాల్లో సంప్రదాయ పానీయంగా గుర్తింపు పొందింది. తెల్లవారుజామున తాటి చెట్టెక్కి మట్టికుండల్లో కల్లు సేకరించే దృశ్యాలు గ్రామీణ జీవితంలో సాధారణమని పెద్దలు చెబుతున్నారు. తాటి చెట్టు రైతులకు అదనపు ఆదాయ వనరుగా కూడా నిలుస్తుందని పేర్కొంటున్నారు. తాజాగా తీసుకున్నప్పుడు లక్షణాలు తాజాగా సేకరించిన తాటికల్లు స్వల్ప తీపి రుచితో, స్వల్పంగా నురుగు ఉన్నట్టుగా ఉంటుందని తెలిసింది. ఉదయం వేళల్లో తీసుకున్న కల్లు మితంగా తీసుకుంటే శరీరానికి చల్లదనం ఇస్తుందని కొందరు పేర్కొంటున్నారు. అయితే సేకరించిన కొంతసేపటికే అది పులిసే స్వభావం కలిగి ఉండటంతో త్వరగా మార్పులు చోటుచేసుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య పరంగా జాగ్రత్త అవసరం తాటికల్లు మద్యం లక్షణాలు కలిగి ఉండే పానీయమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మితిమీరిన వినియోగం వల్ల కాలేయ సమస్యలు, అలవాటు ప్రమాదం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శుభ్రత లేని పరిస్థితుల్లో సేకరించిన కల్లు ఆరోగ్యానికి హానికరమవుతుందని పేర్కొంటున్నారు. గర్భిణులు, యువత, ఆరోగ్య సమస్యలున్నవారు దీనికి దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. సంప్రదాయం □ బాధ్యతతోనే కొనసాగాలి తాటికల్లు గ్రామీణ సంస్కృతిలో భాగమైనప్పటికీ, ఆరోగ్య పరమైన అవగాహనతో వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. మితంగా, శుభ్రతతో సేకరించిన పానీయాలనే వినియోగించాలని సూచిస్తున్నారు. సంప్రదాయం కొనసాగాలంటే ఆరోగ్యాన్ని కాపాడుకునే జాగ్రత్తలు కూడా తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో బీ ఆర్ ఎస్ హవా..

**జమ్మికుంట, ఫిబ్రవరి 13( మన వార్త ప్రతినిధి):**రెండవ సాధారణ మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా జమ్మికుంట మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీ ఆర్ ఎస్ నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డాయి. టిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థుల హవా కొనసాగింది. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 30 వార్డులకు గాను అధికార కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారులు పది వార్డులు, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 12 వార్డులు కైవసం చేసుకొని తన స్థానిక బలాన్ని మరోసారి నిరూపించుకుని విజయకేతనం ఎగురవేశారు. బిజెపి నాలుగు వార్డులు.మూడు వార్డులు స్వతంత్రులు, ఒక వార్డు ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్నారు.

### 30 వార్డులలో విజయం సాధించిన అభ్యర్థులు...


01వ వార్డు పోలు దివ్య (బిఆర్ఎస్)


02వ వార్డు పోల్నేనిశిల్ప (బిఆర్ఎస్)


03వ వార్డు కొలకాని రాజకుమారి (బీ జె పి)


04వ వార్డు పోలినేని అజయ్ రావు (బీ ఆర్ ఎస్)


05 వ యాట్ల సునిత (కాంగ్రెసు)



06వ వార్డు శ్రీపతి స్వర్ణలత ( కాంగ్రెసు)


07 వ వార్డు ఫిరోజ్ (స్వతంత్ర అభ్యర్థి)


08 వ వార్డు కొలుగూరి సురేష్ ( బీ ఆర్ ఎస్)


09 వ వార్డు పొనగంటి రాము ( బీ ఆర్ ఎస్)


10 వ వార్డు తూర్పాటి చందన ( బీ జె పి)



11 వ వార్డు పొనగంటి విష్ణువర్ధన్ (కాంగ్రెసు)


12వ వారు చుంచు రమాదేవి (బీ ఆర్ ఎస్)


13వ వార్డు ఎగిత సునిత (కాంగ్రెసు)



14 వ వార్డు మైస శిరీష (బీ ఆర్ ఎస్)


15 వ వార్డు పాతకాల మౌనిక (కాంగ్రెసు)


16వ వార్డు కొలుగురి సూరంజన్ (బీ ఆర్ ఎస్)


17వ వార్డు బత్తుల లక్ష్మయ్య( ఏ ఐ ఎఫ్ బీ)


18 వ వార్డు కుతాడి తిరుపతి (కాంగ్రెసు)



19వ వార్డు ముంతాజ్ అలీ మహమ్మద్ (బీ ఆర్ ఎస్)


20వ వార్డు గుర్రం కావ్య ( బీ జె పి)


21వ వార్డు చింతల శ్రీను ( బీ ఆర్ ఎస్)



22 వ వార్డు మంద రాధ (బీ ఆర్ ఎస్)



23వ వార్డు ములుగు దిలీప్ ప్రశాత్ కుమార్ (స్వతంత్ర అభ్యర్థి)


24వ వార్డుములుగు ప్రణీత (స్వతంత్ర అభ్యర్థి)



25వ వారు బచ్చు మాధవి (బీ ఆర్ ఎస్)


26వ వారు దిడ్డి కోమల (కాంగ్రెసు)


27వ వార్డు శీలం శ్రీనివాసు ( బీ జె పి)


28వ వారు ఒగ్గ రమేష్ ( కాంగ్రెసు)


29వ వారు మాచర్ల రాజు ( కాంగ్రెస్)


30 వ వార్డు చంద రాజు ( కాంగ్రెసు)

## షుగర్ వ్యాధి నియంత్రణ జీవనశైలి మార్పులతో సాధ్యమే




**డెస్క్,** మధుమేహం (షుగర్ వ్యాధి) నేటి రోజుల్లో వేగంగా పెరుగుతున్న జీవనశైలి వ్యాధులలో ఒకటిగా వైద్య నిపుణులు చెబుతున్నారు. పట్టణాలు మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ వ్యాధి కేసులు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. అనియమిత ఆహారపు అలవాట్లు, కూర్చునే జీవనం, ఒత్తిడి, వంశపారంపర్య కారణాలు షుగర్ వ్యాధికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే సరైన నియంత్రణతో ఈ వ్యాధిని అదుపులో ఉంచవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఆహార నియంత్రణే ప్రధాన ఆయుధం షుగర్ నియంత్రణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుందని వైద్యులు చెబుతున్నారు. తెల్ల బియ్యం, తీపి పదార్థాలు, అధిక కార్బోహైడ్రేట్లు తగ్గించి, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆకుకూరలు, పప్పులు, గోధుమ రొట్టెలు, మొలకెత్తిన విత్తనాలు వంటి ఆహారం రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యంలో ఉంచడంలో సహాయపడుతుందని చెబుతున్నారు. చిన్న చిన్న మోతాదుల్లో తరచుగా భోజనం చేయడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు. వ్యాయామం, బరువు నియంత్రణ అవసరం రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా తేలికపాటి వ్యాయామం చేయడం షుగర్ నియంత్రణకు ఎంతో మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. వ్యాయామం వల్ల శరీరం ఇన్సులిన్‌ను సమర్థంగా వినియోగించుకుంటుందని సూచిస్తున్నారు. బరువు నియంత్రణలో ఉంచడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండే అవకాశముందని పేర్కొంటున్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా షుగర్ నియంత్రణలో భాగమని నిపుణుల అభిప్రాయం. నియమిత పరీక్షలు, వైద్యుల సలహా తప్పనిసరి షుగర్ ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను తరచూ పరీక్షించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యుల సూచించిన మందులు, ఇన్సులిన్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలని చెబుతున్నారు. లక్షణాలు లేకపోయినా పరీక్షలు చేయించుకోవడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించవచ్చని పేర్కొంటున్నారు. ఆహారం, వ్యాయామం, మందులు ఈ మూడు కలిపి పాటిస్తే షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచి ఆరోగ్యంగా జీవించవచ్చని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు కొనుగోలుదారులకు ఊరట



**హైదరాబాద్** గత మూడు నాలుగు రోజులుగా స్థిరంగా కొనసాగిన బంగారం, వెండి ధరలు తాజాగా తగ్గుముఖం పట్టాయి. ధరలు ఒక్కసారిగా కిందకు రావడంతో కొనుగోలుదారులకు ఊరట లభించింది. బంగారం ధర గ్రాముకు రూ.2500కు పైగా తగ్గగా, వెండి ధర కిలోకు సుమారు రూ.15,000 వరకు తగ్గింది. ఈ రోజు ఉదయం పది గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,780గా నమోదైంది. నిన్నటి ధరతో పోల్చితే రూ.2,620 తగ్గింది. అదే విధంగా 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,42,800కు చేరుకుని రూ.2,400 మేర తగ్గుదల నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా బంగారం ధరలు తగ్గాయి. అక్కడ 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,930గా ఉండగా, 22 క్యారెట్ల పది గ్రాముల ధర రూ.1,42,950గా నమోదైంది. వెండి ధర కూడా గణనీయంగా పడిపోయింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. ఇదే ధర ఢిల్లీలోనూ కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో పాటు డిమాండ్ తగ్గుదల కారణంగా ధరల్లో ఈ తగ్గుదల కనిపించినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## 'ఏఐ' ప్రభావం – స్టాక్ మార్కెట్లలో భారీ పతనం




**ముంబై** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజూ భారీ నష్టాలతో ముగిశాయి. శుక్రవారం జరిగిన లావాదేవీల్లో అమ్మకాల ఒత్తిడి తీవ్రంగా పెరగడంతో సూచీలు గణనీయంగా క్షీణించాయి. కృత్రిమ మేధస్సు ప్రభావంతో భారత ఔట్‌సోర్సింగ్ విధానంపై అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయనే భావన పెట్టుబడిదారుల మనోభావాలను దెబ్బతీసినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. లావాదేవీలు ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,048 పాయింట్లు పడిపోయి 82,626 వద్ద స్థిరపడింది. అలాగే ఎన్ఎస్ఈ నిఫ్టీ 336 పాయింట్లు నష్టపోయి 25,471 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలతో పాటు మధ్యస్థ, చిన్న స్థాయి షేర్లలోనూ అమ్మకాలు ఎక్కువగా నమోదయ్యాయి. నిఫ్టీ మధ్యస్థ సూచీ 1.71 శాతం, చిన్న స్థాయి సూచీ 1.79 శాతం మేర పడిపోయాయి. రంగాల వారీగా పరిశీలిస్తే దాదాపు అన్ని విభాగాలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా లోహ రంగ షేర్లు అత్యధికంగా క్షీణించాయి. రియల్ ఎస్టేట్, సమాచార సాంకేతిక, వినియోగ వస్తు రంగాల్లోనూ భారీ అమ్మకాలు కనిపించాయి. నిఫ్టీ 50లోని ఎక్కువ భాగం షేర్లు నష్టాల్లో ముగియడం మార్కెట్ బలహీనతను స్పష్టంగా చూపించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా బలహీనపడి 90.61 వద్ద నమోదైంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ కీలకమైన చలన సగటు స్థాయిల కంటే దిగువకు పడిపోయినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. స్వల్పకాలికంగా లాభాల స్వీకరణ కొనసాగుతున్నప్పటికీ, కీలక మద్దతు స్థాయిల వద్ద మార్కెట్ ప్రవర్తన ఆధారంగా తదుపరి దిశ నిర్ణయమయ్యే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## బ్యాంకింగ్ నిబంధనల్లో భారీ మార్పులు





**ముంబై** బ్యాంకింగ్ రంగంలో వినియోగదారుల హక్కులను పరిరక్షించే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. క్రెడిట్ కార్డులు, బీమా పాలసీల విక్రయ విధానాలపై కఠిన నిబంధనలు జారీ చేసింది. జూలై 1 నుంచి ఈ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. సింగిల్ క్లిక్ విక్రయాలకు ముగింపు బ్యాంకులు రుణాలు లేదా ఖాతాలు తెరవడం సందర్భంగా కస్టమర్లకు తెలియకుండా బీమా, క్రెడిట్ కార్డులను జతచేసే విధానంపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. ఇకపై కస్టమర్ల స్పష్టమైన, విడి ఆమోదం లేకుండా ఏ ఉత్పత్తినీ విక్రయించరాదు. ఒకే క్లిక్‌తో బహుళ సేవలను అంగీకరించే విధానాన్ని నిషేధించింది. కస్టమర్ అనుమతి తప్పనిసరి ఆన్‌లైన్‌లో 'అంగీకరిస్తున్నాను' అనే బటన్ నొక్కగానే అనేక సేవలు ఆటోమేటిక్‌గా అమలయ్యే పరిస్థితిని ఆర్బీఐ అనుచితంగా పేర్కొంది. ప్రతి ఉత్పత్తికి ప్రత్యేకంగా, స్పష్టంగా కస్టమర్ సమ్మతి తీసుకోవాలని ఆదేశించింది. ఉత్పత్తి వివరాలు పూర్తిగా తెలియజేయడం బ్యాంకుల బాధ్యతగా పేర్కొంది. అవసరాలకు సరిపోతేనే విక్రయం కస్టమర్ ఆర్థిక స్థితి, ఆదాయానికి అనుగుణంగా ఉత్పత్తులు ఉండాలనే నిబంధనను కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది. పరిమిత ఆదాయం ఉన్నవారికి అధిక ప్రీమియం లేదా అధిక ఛార్జీల ఉత్పత్తులు విక్రయిస్తే అది తప్పుదారి పట్టించడం కింద పరిగణిస్తామని హెచ్చరించింది. ఉత్పత్తి బ్యాంక్‌దా లేక వేరే సంస్థదా అన్నది ముందుగానే తెలియజేయాలి. డిజిటల్ మాయాజాలాలకు చెక్ 'డార్క్ ప్యాటర్న్స్'గా పిలువబడే డిజిటల్ వ్యూహాలను ఆర్బీఐ నిషేధించింది. ముందే టిక్ చేసిన సమ్మతి పెట్టెలు, "ఇవాళే చివరి అవకాశం" వంటి ఒత్తిడి సృష్టించే ప్రకటనలు ఇక అనుమతించబడవు. వినియోగదారులపై మానసిక ఒత్తిడి తెచ్చే విధానాలు పూర్తిగా ఆపాలని బ్యాంకులకు సూచించింది. ఈ కొత్త నిబంధనలతో బ్యాంకింగ్ రంగంలో పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారుల హక్కులు మరింత బలపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఆధార్ కార్డు ఉన్న ప్రతి మహిళకు ఉచిత స్కూటీ అంటూ వైరల్‌డ అసలు నిజం ఇదే



**న్యూఢిల్లీ** ఆధార్ కార్డు ఉన్న ప్రతి మహిళకు ఉచితంగా స్కూటీ ఇవ్వనున్నట్లు చెబుతూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో పూర్తిగా తప్పుడు సమాచారమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు ఉచిత స్కూటర్లు అందిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం అలాంటి పథకం ఏదీ అమలులో లేదని అధికారులు వెల్లడించారు. ఈ వీడియోపై పరిశీలన జరిపిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిజ నిర్ధారణ విభాగం, ఇది కృత్రిమ మేధస్సు సాంకేతికతతో తయారు చేసిన నకిలీ వీడియో అని వెల్లడించింది. వీడియోలో చేసిన ప్రకటనలకు ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని, ప్రజలను తప్పుదారి పట్టించే ఉద్దేశంతో రూపొందించబడినదేనని పేర్కొంది. ఇటీవలి కాలంలో రాజకీయ నాయకుల స్వరాలు, ముఖాలను అనుకరిస్తూ నకిలీ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు పెరుగుతున్నాయని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి సందేశాలను నమ్మకముందు అధికారిక వనరుల ద్వారా నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై సరైన సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ myscheme.gov.in qT మాత్రమే ఆధారంగా తీసుకోవాలని సూచించారు. కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాల పేరుతో వచ్చే అనుమానాస్పద వీడియోలు, వార్తలు కనిపించినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. డిజిటల్ యుగంలో తప్పుడు వార్తలు వేగంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఏ పథకం గురించి అయినా అధికారిక ప్రకటన వెలువడిన తర్వాతే నమ్మాలని, నిర్ధారణ లేని సమాచారాన్ని పంచుకోవడం నివారించాలని సూచిస్తున్నారు.

# రిస్క్ తగ్గించే ప్లాన్‌లో రవితేజ..



**హైదరాబాద్,** టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ తన కెరీర్‌లో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వరుసగా వచ్చిన పరాజయాలు, మారుతున్న మార్కెట్ పరిస్థితులు, ఓటీటీ హక్కుల విలువల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో నిర్మాతలపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక్కో సినిమాకు రూ. 20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం తీసుకుంటున్న రవితేజ, ప్రస్తుతం ఫిక్స్‌డ్ రెమ్యూనరేషన్‌ను కొంతవరకు తగ్గించి, సినిమా లాభాల్లో వాటా తీసుకునే 'ప్రాఫిట్ షేరింగ్ మోడల్' వైపు మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ విధానం ద్వారా సినిమా ప్రారంభ దశలో నిర్మాతలపై పెట్టుబడి ఒత్తిడి తగ్గుతుండగా, సినిమా విజయవంతమైతే లాభాల్లో హీరోకు వాటా లభించే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో భారీ బడ్జెట్ సినిమాలపై నిర్మాతలు జాగ్రత్తగా వ్యవహరిస్తుండటంతో, ఈ నిర్ణయం ఇండస్ట్రీలో సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. ఒకవేళ సినిమా ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా నిర్మాతలకు నష్టం తగ్గే అవకాశముందని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో మారుతున్న మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నాని, సాయి ధరమ్ తేజ్, నందమూరి బాలకృష్ణ వంటి హీరోల ప్రాజెక్టుల విషయంలో కూడా ఇలాంటి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. తన మార్కెట్‌ను కాపాడుకుంటూనే నిర్మాతలకు భరోసా కల్పించేలా రవితేజ తీసుకున్న ఈ కొత్త బిజినెస్ మోడల్ ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విధానం ఆయన తదుపరి సినిమాలకు ఎంతవరకు ప్లస్ అవుతుందో చూడాల్సి ఉంది.

## పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశాలు : వరుణ్ చక్రవర్తి



**న్యూఢిల్లీ** ఐసీసీ టీ20 ప్రపంచకప్లో భాగంగా ఆదివారం పాకిస్థాన్తో జరగనున్న కీలక మ్యాచ్‌లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత జట్టు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వెల్లడించాడు. ఇటీవల కడుపు సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడిన అభిషేక్ ఆరోగ్యం ప్రస్తుతం మెరుగుపడిందని, అతడు జట్టుతో తిరిగి సాధన ప్రారంభించినట్లు వరుణ్ తెలిపాడు. నమీబియాతో జరిగిన గత మ్యాచ్‌కు ముందు అస్వస్థత కారణంగా అభిషేక్ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. రెండు రోజుల విశ్రాంతి అనంతరం అతని ఆరోగ్యం నిలకడగా ఉందని, జట్టుతో మాట్లాడినప్పుడు అతడు సానుకూలంగా స్పందించాడని వరుణ్ చెప్పాడు. ఆదివారం జరిగే మ్యాచ్‌కు ముందు జరిగే సాధనలో అతడి ప్రదర్శన ఆధారంగా తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి అద్భుతంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తక్కువ పరుగులే ఇచ్చి మూడు వికెట్లు సాధించడం ద్వారా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ మ్యాచ్ సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, అభిషేక్ ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు మిస్ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాడు. అభిషేక్ గైర్హాజరీలో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టి జట్టుకు మంచి ఆరంభం అందించాడు. ఆ మ్యాచ్‌లో భారత్ జట్టు సమగ్ర ప్రదర్శనతో నమీబియాపై భారీ తేడాతో విజయం సాధించింది. ఇప్పుడంతా పాక్‌తో జరగనున్న మ్యాచ్‌పైనే దృష్టి సారించింది. కొలంబోలో రిగే సాధనలో అభిషేక్ పూర్తి స్థాయిలో పాల్గొంటే అతడు తుది జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జట్టు వర్గాలు భావిస్తున్నాయి. అతని రాకతో ఓపెనింగ్ విభాగం మరింత బలపడుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటీటీలోనూ మెగా విధ్వం 24 గంటల్లోనే 'మన శంకరవరప్రసాద్ గారు' రికార్డుల వేట!




**హైదరాబాద్** మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో వచ్చిన మన శంకరవరప్రసాద్ గారు చిత్రం థియేటర్లలో సృష్టించిన విజయోత్సాహం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ వినోదాత్మక చిత్రం ప్రేక్షకుల నుంచి అపూర్వ ఆదరణ పొందుతూ భారీ వసూళ్లు సాధించింది. దాదాపు రూ. 375 కోట్లకు పైగా వసూళ్లు సాధించి చిరంజీవి సినీ ప్రస్థానంలోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. థియేటర్లలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఇటీవల డిజిటల్ వేదికలోకి వచ్చిన తరువాత కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతోంది. ప్రముఖ డిజిటల్ వేదిక జీ5లో ఫిబ్రవరి 11న ప్రసారం ప్రారంభమైన ఈ చిత్రం కేవలం 24 గంటల్లోనే కోట్ల సంఖ్యలో వీక్షణ నిమిషాలను సాధించి కొత్త రికార్డును నమోదు చేసింది. ఒక్క రోజులోనే ఈ స్థాయి స్పందన రావడం విశేషమని వర్గాలు తెలిపాయి. కుటుంబ కథాంశం, వినోదభరితమైన సంభాషణలు, చిరంజీవి నటనకు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. థియేటర్లలో విజయపథంలో దూసుకెళ్లిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ వేదికలపై కూడా అదే జోరు కొనసాగించడం విశేషంగా మారింది. మెగాస్టార్ మాయ వెండితెరతో పాటు ఇంటి తెరలపై కూడా తగ్గలేదని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# అలా బౌలింగ్ చేస్తే పక్కకు జరగండి..



**న్యూఢిల్లీ** ఉస్మాన్ తారీఖ్ బౌలింగ్ యాక్షన్‌పై వివాదం నెలకొన్న నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ భారత బ్యాటర్లకు ఆసక్తికరమైన సలహా ఇచ్చాడు. బౌలింగ్ చేసే సమయంలో తారీఖ్ మధ్యలో ఆగితే బ్యాటర్లు క్రీజ్ నుంచి పక్కకు జరగాలని సూచించాడు. ఆదివారం భారత్–పాకిస్థాన్ మధ్య జరగనున్న కీలక మ్యాచ్ ముందు అశ్విన్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. బౌలింగ్ చేయడానికి ముందుగా తారీఖ్ కాసేపు ఆగి తర్వాత బంతిని వేయడం వల్ల బ్యాటర్లు టైమింగ్ పట్టుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని క్రికెట్ నిపుణులు చెబుతున్నారు. అతని చేతి వంపు కూడా అనుమతించిన పరిమితిని మించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. గతంలో అతని బౌలింగ్‌పై ఆస్ట్రేలియా ఆటగాడు కెమరూన్ గ్రీన్, దక్షిణాఫ్రికా ఆటగాడు డేవాల్డ్ బ్రెవిస్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఐసీసీ టీ20 ప్రపంచకప్లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య హైటెన్షన్ మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో అశ్విన్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. బౌలర్ బంతి వేయడానికి ముందు ఆగిపోతే బ్యాటర్‌కు పక్కకు జరిగే హక్కు ఉంటుందని, అలాంటి సందర్భాల్లో అంపైర్ నిర్ణయం కీలకంగా మారుతుందని తెలిపాడు. తారీఖ్ ఇప్పటికే టీ20ల్లో మంచి ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నాడు. తక్కువ సగటుతో పరుగులు ఇచ్చుతూ వికెట్లు సాధిస్తున్న అతని బౌలింగ్ భారత్‌కు సవాల్‌గా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాచ్‌లో బౌలింగ్ యాక్షన్ ఎలా ఉంటుందన్నదే ఇప్పుడు ఆసక్తికర అంశంగా మారింది.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com